కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్‌దే విజయం

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యనందిత

బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, డిసెంబర్ 1: 45 రోజులుగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా పని చేశారు. ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నా పార్టీకి కట్టుబడి నిలబడ్డారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించనున్నారని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గ్యాని లాస్యనందిత అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన శ్రేణులకు శిరస్సు వంచి వందనం చేస్తున్నానన్నారు. ఓటర్లను ప్రతిపక్షాలు ప్రలోభ పెట్టాలని, బెదిరించాలని చూసినా విచక్షణతో ఓటేశారన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని తెలిపారు.

గోషామహల్‌లో గులాబీదే గెలుపు

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

అబిడ్స్, డిసెంబర్ 1 : బీజేపీ కంచుకోట ఐన గోషామహల్ అసెంబ్లీ సెగ్మంట్‌లో బీఆర్ఎస్ పాగా వేస్తోందని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జి కోలేటి దామోదర్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామంటూ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీతో ఓటర్లు విశ్వసించి బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గోషామహల్‌ను మరో గచ్చిబౌలిగా తీర్చిదిద్దుతామంటూ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీతో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ గెలుపునకు ఓటర్లు సహకరించారన్నారు. గోషామహల్‌లో బీఆర్ఎస్ గెలుపు రాష్ట్ర రాజకీయాలకు మరో మలుపు కానున్నదని తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి ఈశ్వరీబాయి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాజీలేని పోరాటం చేసిన వీరవనిత ఈశ్వరీబాయి అని మాజీ మంత్రి గీతారెడ్డి అన్నారు. ఈశ్వరీబాయి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ జాన్స్ చర్చి ఎదురుగా ఉన్న ఈశ్వరీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి, మేఘనారెడ్డి పాల్గొన్నారు.

–మారేడ్‌పల్లి, డిసెంబర్ 1

కాన్క్లేవ్, ట్రేడ్ ఫెయిర్‌లపై ప్రత్యేక దృష్టి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాసిక్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మధుమతి సర్దేశాయ్

మాదాపూర్, డిసెంబర్ 1: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మహారాష్ట్ర టూరిజం ఆధ్వర్యంలో మహారాష్ట్ర టూరిజం పెవిలియన్, ఐఐటీఎం హైదరాబాద్ 2023 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాసిక్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మధుమతి సర్దేశాయ్ విచ్చేసి అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రవిపాటి, మహారాష్ట్ర ప్రభుత్వ పర్యాటక డైరెక్టరేట్, డాక్టర్ బీఆర్ పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్క్లేవ్, ట్రేడ్ ఫెయిర్‌లపై మహారాష్ట్ర పర్యాటక సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పర్యటనలు, హోటళ్లు, రవాణాలు మొదలైన వాటితో సహా మొత్తం పర్యాటక సేవలను ఇవి అందిస్తున్నట్లు మహారాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి జయశ్రీ భోజ్ తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన 16 ప్రతిష్టాత్మక పర్యాటక సంస్థలు పాల్గొన్నాయి.

క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఇండియన్ బాస్కెట్ బాల్ మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్
- ఇక్ఫాయ్ ఐబీఎస్‌లో ప్రారంభమైన జాతీయ క్రీడోత్సవాలు
- మీడియా పార్ట్‌నర్‌గా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే

బిజినెస్ స్కూల్స్ ఇంటర్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌కు హాజరైన ఇండియన్ బాస్కెట్ బాల్ మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మేనేజ్‌మెంట్ విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, విద్యార్థి దశలోనే క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇండియన్ బాస్కెట్ బాల్ మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ సూచించారు. శుక్రవారం మోకిలలోని ఇక్ఫాయ్ క్యాంపస్‌లో ఐబీఎస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆవేగ్ 14 పేరుతో నిర్వహించిన జాతీయ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహ్మద్ రిజ్వాన్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏ చేస్తున్న వారంతా ఒక్క చోట చేరి తమ కిష్టమైన క్రీడల్లో ఒకరితో ఒకరు పోటీపడడం విద్యార్థుల్లో పోరాటపటిమను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో టీమ్ వ్యాప్స్ మాజీ అధ్యక్షుడు షఫిక్, పవన్ నందకుమార్,టీమ్ వ్యాప్స్ అధ్యక్షులు మహి త్యాగి, ఉపాధ్యక్షులు భాస్కర్ యాదవ్, నితిన్ శర్మ, సిద్ధార్థ్ గార్గ్, శ్రేయ్ చోరారియా, మానిశ్ సింగ్, సుస్మిత పండా, మోలీ జైన్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ మాధవి గరికపర్తి తదితరులు పాల్గొన్నారు. ఇక్ఫాయ్ ఐబీఎస్ హైదరాబాద్‌కు చెందిన టీమ్ వ్యాప్స్ ఆధ్వర్యంలో ఆవేగ్ 14 పేరుతో నిర్వహిస్తున్న బిజినెస్ స్కూల్స్ ఇంటర్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌కు మీడియా పార్ట్‌నర్స్‌గా నమేస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంస్థలు వ్యవహరిస్తున్నాయి.

మొదటి రోజు 8 అంశాల్లో క్రీడా పోటీలు..

టీమ్ వ్యాప్స్ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ నగరాల్లోని బిజినెస్ స్కూళ్లలో చదువుతున్న ఎంబీఏ విద్యార్థులతో 15 క్రీడాంశాలతో పోటీలను నిర్వహించారు. బాస్కెట్‌బాల్, బాడ్మింటన్, క్రికెట్, స్క్వాష్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, చెస్, బీజీఎంఐ, క్యారమ్ వంటి క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటనున్నారు. మొదటి రోజు 8 క్రీడాంశాల్లో బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్,టేబుల్ టెన్నిస్,త్రోబాల్,వాలీబాల్, చెస్, ఫుట్‌బాల్‌లలో పోటీలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు.

క్యాంపస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు..

ఇక్ఫాయ్ హైదరాబాద్ క్యాంపస్‌లో వార్షిక క్రీడోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. రకరకాల క్రీడా మైదానాలను ప్రత్యేకంగా తీర్చిదిద్ది క్రీడలు సాఫీగా జరిగేందుకు అనుగుణంగా మార్కింగ్, ఇతర మౌలికవసతులను మైదానాల్లో కల్పించారు. దేశంలోని వివిధ బిజినెస్ స్కూళ్ల నుంచి ఎంబీఏ విద్యార్థులు పాల్గొంటున్న నేపథ్యంలో క్రీడా కారులకు అవసరమైన ఏర్పాట్లను క్యాంపస్‌లో కల్పించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతామని టీమ్ వ్యాప్స్ ప్రతినిధి తెలిపారు.

రేపు ఫైనల్స్..

ఇక్ఫాయ్ ఐబీఎస్ హైదరాబాద్‌లో జరుగుతున్న క్రీడా పోటీల ఫైనల్స్ ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12 అంశాల్లో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బృందాలను విజేతలుగా ఎంపిక చేసి వారికి బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు

రియల్ ఎస్టేట్‌కు డోకా ఉండదు

క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్ కుమార్, ఉషా గౌతమ్, క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

మాదాపూర్, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌కు ఎటువంటి డోకా ఉండదని, ఎల్లప్పుడు పెరుగుతూనే ఉంటుందని క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో 2023 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి విచ్చేసి ఎస్‌బీఐ సీజీఎం హైదరాబాద్ సర్కిల్ రాజేశ్ కుమార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్, ముంబాయి సీజీఎం ఉషా గౌతమ్‌తో పాటు ఎన్ డబ్ల్యూ జనరల్ మేనేజర్ హైదరాబాద్ డెబాషిష్ మిశ్రా, హైదరాబాద్ డీజీఎం రవీంద్ర హిట్నాల్లి,నారెడ్కొ అధ్యక్షుడు సునీల్ చంద్రారెడ్డి, తెలంగాణ బిల్డర్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ విద్యాసాగర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ 22 శాతం మార్కెట్ వాటాతో గృహ రుణ విభాగంలో 7 ట్రిలియన్ మార్కును చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ఎస్‌బీఐ 23 వేల బ్రాంచ్‌లను పూర్తి చేసుకొని కస్టమర్లకు పూర్తి చేరువలో ఉందన్నారు. ఎస్‌బీఐలో గృహ రుణాలు పొందే వారికి మంచి సదావకాశాన్ని ఇస్తుందని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ సీజీఎం హైదరాబాద్ సర్కిల్ రాజేశ్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులను ఆకర్షించేందుకు బిల్డర్లు, డెవలపర్లు పలు రకాల స్కీంలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 150 కి పైగా స్టాల్స్‌ను ప్రదర్శించారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ క్యాల్లిన్‌కు ఆహ్వానం

డాక్టర్ వీజేఈ క్యాల్లిన్

వనస్థలిపురం, డిసెంబర్ 1 : యూనివర్సిటీ ఆఫ్ దుబాయ్ నిర్వహించనున్న ఐఈఈఈ గ్రీన్ టెక్ సదస్సుకు టీకేఆర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వీజేఈ క్యాల్లిన్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 5 నుంచి 12 వరకు దుబాయ్‌లో జరగనున్న ఈ సింపోసియంలో 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, స్లమ్స్' అనే అంశంపై ఆమె ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పాల్గొనే ఈ సదస్సులో తనకు అవకాశం దక్కడంపై సంతోషం వ్యక్తం చేశారు.

లైఫ్‌స్టైల్ వస్త్ర ప్రదర్శనలో అవికా గోర్ సందడి

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : బంజారాహిల్స్‌లో స్పాన్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ వస్త్ర ప్రదర్శనను హీరోయిన్ అవికా గోర్ శుక్రవారం ప్రారంభించి సందడి చేసింది. ఔత్సాహిక మహిళా ఫ్యాషన్ డిజైనర్లు, మహిళా పారిశ్రామిక వార్తలు, సంప్రదాయ చేనేత చీరలు, లైఫ్ స్టయిల్ ఉపకరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. శనివారం రాత్రి వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు అంజలి రెడ్డి, స్వాతి వేముల తెలిపారు.